భయం ఏర్పడి అతనిలో ఆందోళన మొదలైంది. బయట తలుపు గడియ పెట్టి వుండటంతో బయటకి వెళ్ళలేక పోయాడు. ఆ రాత్రంతా అతను మేలుకుని ఆ కత్తి వంకే చూస్తూ భయంగా గడిపాడు.

మర్నాడు వుదయం అతని కుటీరం తలుపు తెరచుకుని వచ్చిన సన్న్యాసి అడిగాడు.

"రాత్రి బాగా నిద్ర పట్టిందా?"

"ఊహు. ఆ కత్తి వంక చూస్తుంటే ఎక్కడ నిద్ర పడుతుంది?"

"రాత్రంతా నువ్వు మృత్యు స్మరణలో వున్నట్లుగా నేను దైవం మీద మనసుని కేంద్రీకరించి ఆయన గురించి ఆలోచిస్తున్నాను. నీకు నీ ప్రాణం ఎంత ముఖ్యమో నాకు దైవం అంత ముఖ్యం అనుకోబట్టే ఇది సాధ్యం అయింది." వివరించాడా సన్న్యాసి.

## 65. త్యాగి

వర్షాకాలంలో వేగంగా ప్రవహించే అలకానంద నదిలో ఓ పడవలో ప్రయాణించేవారిలో, చైనా నించి ఇండియాకి వచ్చిన యాత్రికుడు హ్యూయన్‌సాంగ్ కూడా ఉన్నాడు. అతను తన వెంట నలందా విశ్వవిద్యాలయం నించి సేకరించిన అపూర్వ గ్రంధాలెన్నిటినో టిబెట్‌కి తీసుకెళ్తున్నాడు. నది ఉధృతికి పడవని కంట్రోల్ చేయడం పడవ నడిపే సరంగు వల్ల కావడం లేదు. పడవ మునిగిపోవచ్చున్న భయంతో సరంగు ప్రయాణీకులకి చెప్పాడు.

"పడవలో ఎక్కువ మంది మనుషులు ఎక్కడంతో బరువు ఉండాల్సిన దానికన్నా ఎక్కువగా ఉంది. పడవ తేలిక అయితే తేలిగ్గా అవతలి గట్టుకి చేరగలం. కాబట్టి అంతా కొంత సామానుని నదిలోకి పారేసి పడవ బరువుని తగ్గించండి."

అంతా హ్యూయాన్‌సాంగ్ వైపు తిరిగి చెప్పారు.

"నీ దగ్గర ఉన్న మూటలోని పుస్తకాలు మనిషి బరువు కన్నా ఎక్కువ. కాబట్టి నువ్వా మూటని బయటకి గిరాటేస్తే చాలు."

"కాని ఇవి అమూల్యమైన ధార్మిక గ్రంథాలు. ఈ పడవలోని ఏ వస్తువు పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు కాని ఈ గ్రంథాలు పోతే తిరిగి దొరకవు." అభ్యంతరం చెప్పాడు హ్యూయాన్‌సాంగ్.

"అవును. వీటిని మా గురువుగారు ఎంతో డబ్బిచ్చి కొన్నారు. మీ సామాను పారేయండి." హ్యూయాన్‌సాంగ్ శిష్యుడు కూడా వారిని కోరాడు.

తోటి ప్రయాణీకులు అతని మాటలని పట్టించుకోకుండా ఆ మూటని పారేయమని గొడవ చేయసాగారు. పడవ అల్లల్లాడుతూ ఏ క్షణంలోనైనా మునిగి పోవడానికి సిద్ధంగా ఉంది.

హ్యూయాన్‌సాంగ్‌కి ఆ గ్రంథాలని నీళ్ళల్లో పారేయాలన్న ఆలోచనకే భయం కలిగింది. ఆయన నోట మాట పెగల్లేదు. అందరికీ మౌనంగా దణ్ణం పెట్టడం తప్ప ఇంకేం చేయలేకపోయాడు.

"త్వరగా." అరిచాడు సరంగు.

"ఆఖరిసారి అడుగుతున్నాను. ఎవరూ నా మాటని మన్నించరా?" శిష్యుడు కీచు గొంతుతో అరిచాడు.

"ముందా మూటని పారేయండి."

వాళ్ళంతా ఆ పుస్తకాల మూటని నీళ్ళల్లోకి విసిరేయడానికి అందుకున్నారు.

"ఆగండి." అరిచాడు శిష్యుడు.

వాళ్ళ చేతిలోని మూటని అందుకుని గురువు దగ్గర ఉంచి, తన గురువు కాళ్ళకి, ఆ పుస్తకాల మూటకి త్వరగా నమస్కరించాడు.

'వేరే దారి లేదు గురుదేవా' అని అరిచి చిరునవ్వు నవ్వుతూ ఒక్కసారిగా పడవలోంచి సుడులు తిరిగే నీళ్ళల్లోకి దూకేసాడు. ప్రయాణీకుల్లోని ఎవరి నోటా మాట రాలేదు. మునిగిపోతున్న తన ప్రియ శిష్యుడికి రెండు చేతులూ జోడించి దణ్ణం పెడుతూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు హ్యూయాన్‌సాంగ్.

బరువు తగ్గడం వల్లో, ఆ సాహస యువకుడి ఆత్మాహుతి వల్లో పడవ ఊగడం ఆగింది. ఆ అమూల్య గ్రంథాలన్నీ కాపాడబడ్డాయి. హ్యూయాన్‌సాంగ్‌కి

తోడుగా పంపబడ్డ ఆ నలందా విశ్వవిద్యాలయ యువకుడు చేసిన ఆ త్యాగం వల్లే టిబెట్‌కి ఆ పుస్తకాలు చేరి, లామాలు ఆధ్యాత్మికంగా పురోగతిని సాధించగలిగారు.

## 66. మాట తప్పక

ఓ పిసినారి కొడుకు వేలికి ఓ కురుపు లేచింది. ఎన్ని మందులకి అది తగ్గకపోవడంతో అతను తన ఇష్ట దైవం అయిన హనుమంతుడి గుడికి వెళ్ళి మొక్కుకున్నాడు.

"నా కొడుకు వేలు నయం అయితే నీకు వడమాల వేయించి, అప్పాలు చేయించి నైవేద్యం పెడతాను."

వెంటనే ఆ పిల్లవాడు కోలుకున్నాడు. ఐతే ఆ పిసినారి 'ఇప్పటికే వైద్యులకి, మందులకి చాలా ఖర్చు చేసాను. కాబట్టి వడ మాల మానేసి అప్పాలు నైవేద్యం పెట్టి వూరుకుంటాను' అనుకున్నాడు. కాని చూస్తూ, చూస్తూ రెండు వందల ఏభై రూపాయలు పెట్టి అప్పాలని చేయించబుద్ధి కాలేదతనికి. రోజులు వారాలయ్యాయి. అతని భార్య ఓ రోజు అతనికి మొక్కు గురించి గుర్తు చేసింది.

"నేను బీదవాడినని స్వామికి ఎటూ తెలుసు కదా. అదీ కాక స్వామి అప్పాలు తింటాడా ఏమిటి? సగం మనకిచ్చి పూజారి మిగిలినవి భక్తులకి పంచడమే కదా జరిగేది. స్వామికి ఆకు పూజ చేయిస్తాను. తక్కువలో పోతుంది." చెప్పాడు అతను.

"ఆలస్యం చేయకుండా మరి అదైనా చేయండి."

గుడికి వెళ్తూంటే అతని పిసినారి బుర్రలో ఇంకో ఆలోచన మెదిలింది.

'ఆకు పూజకి వంద రూపాయల దాకా ఖర్చవుతుంది. అదే కొబ్బరికాయ కొడితే పది రూపాయలతో పోతుంది.'

గుడి బయట కొబ్బరి కాయలు అమ్మే దుకాణానికి వెళ్ళాడు. దుకాణంవాడు ఒకో కాయ పన్నెండు రూపాయలు చెప్పాడు.

"క్రితం సారి ఎనిమిదికే కొన్నాను."